సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం । 27 । మార్చి । 2023



నిరుపేద.. ఆపై పెద్ద బాధ
నిరుపేద కుటుంబం..ఆపై వారికి పెద్ద బాధ వచ్చింది. గర్భిణికి తలలో రక్తం గడ్డ కట్టింది..వెంటనే ఆపరేషన్ చేయకుంటే ప్రాణానికి ప్రమాదమని వైద్యులు చెప్పారు. -8లో..



'కళ' తప్పిన రంగస్థలం
సురభి పుట్టిన జిల్లాలో నాటకం కొడిగడుతున్న దీపంలా కొట్టుమిట్టాడుతోంది. భావితరాలు ఈ రంగం వైపు వచ్చే అవకాశాలు మూసుకుపోయాయి. -8లో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
39.2/26.7
జిల్లాలో ఆదివారం 26.7– 39.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	సోమ (సా॥)	మంగళ (ఉ॥)
కడప	6.30	4.58
ప్రొద్దుటూరు	6.32	5.02
పులివెందుల	6.33	5.03

ఉండమ్మా.. బొట్టు పెడతా.!

SAKSHI SPECIAL

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో తరతరాలుగా వింత ఆచారం కొనసాగుతోంది. మొరుసుకాపు తెగకు చెందిన మహిళలు కొద్దేవర బొట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఆచారం ఎందుకొచ్చింది.. ఎలా వచ్చింది అనే విషయాలు స్పష్టంగా తెలియకపోయినా తమ పూర్వీకుల కాలం నుంచి వస్తోంది కనుక తాము ఆచరిస్తున్నామని.. ఇది శుభప్రదమని వారు పేర్కొంటున్నారు.

- మొరుసు కాపుల్లో వింత ఆచారం
- ఆనవాయితీగా కొద్దేవర బొట్లు
- శుభప్రదంగా భావిస్తున్న మహిళలు



తంబళ్లపల్లె మండలం దిగువగాలిగుంటపల్లెలో కొద్దేవర బొట్టు కార్యక్రమంలో మహిళలు

కురబలకోట: అన్నమయ్య జిల్లాలో మొరుసు కాపులున్న గ్రామాల్లో వింత ఆచారం కొనసాగుతోంది. కొందరు ఆరు నెలలకు.. మరికొందరు ఏడాదికోసారి మహిళలు కొద్దేవర బొట్టు కార్యక్రమం నిర్వహిస్తారు. నుదుట బొట్టు పెట్టించుకోవడమే కొద్దేవర బొట్టుగా వ్యవహరిస్తారు. పెళ్లయిన మహిళలు దీనిని చేయడం ద్వారా శుభ ప్రదంగా ఉంటుందన్న భావన కొనసాగుతోంది. దీన్ని తరతరాలుగా క్రమంగా ఆచరిస్తూ వస్తున్నారు. పూర్వీకుల నుండి ఇదొక ఆచారంగా స్థిరపడిపోయింది. ఈ ఆచారం ఆశ్చర్యపరుస్తుంది. పెద్దల ఆచారాన్ని నేటి తరం మహిళలు కూడా ఆచరిస్తూ గౌరవిస్తున్నారు. ఇది కుతూహలాన్ని కల్గిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల్లో మొరుసు కాపులున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వీరు మరీ ఎక్కువగా ఉన్నారు. రెడ్డి కులస్థులలో వీరిది ఓ తెగ. ఈ ఆచారాన్ని మహిళలు తు.చ. తప్పకుండా ఆచరిస్తూ వస్తుండడం విశేషం. పెద్దలు మంచి ఆలోచనతో ప్రవేశపెట్టారని అందువల్లే తాము దీన్ని కొనసాగిస్తున్నామని మహిళలు చెబుతున్నారు. మహిళలు నుదుట బొట్టు పెట్టుకోవడం సాధారణమే అయినా ఈ కొద్దేవర బొట్టు విశిష్టమైనదే కాదు ప్రత్యేకమైనది.. అంతకంటే శుభ ప్రదంగా భావిస్తారు.

ఎప్పుడు చేస్తారంటే..
ఉగాది, నోముల పండగ రోజుల్లో బొట్టు దేవర కార్యక్రమం నిర్వహిస్తారు. శని, ఆదివారాల్లో మాత్రమే చేయడం పరిపాటి. ఉపవాసంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. బెల్లం, పసుపు, పచ్చి వడ్లు తదితర వాటిని నూరి మిశ్రమం తయారు చేస్తారు. దీన్ని బొట్టుగా పెట్టుకోడానికి పెద్దగా ఉన్న వారు అందజేస్తారు. అంతేకాదు తినడానికి కూడా ఈ మిశ్రమాన్ని ఇస్తారు. ఉగాది పండుగ నేపథ్యంలో ఆదివారం నియోజకవర్గంలోని పలు పల్లెల్లో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు బొట్టు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పెద్దచే బొట్టు అందుకుంటున్న మహిళలు

వంశపారంపర్యంగా వస్తోంది



కొద్దేవర బొట్టును మా గ్రామ మహిళలకు మా వంశస్థులు ఇచ్చేవారు. ఇది వంశ పారంపర్యంగా నాకు లభించింది. 15 ఏళ్లుగా నేను పెద్దగా ఉంటూ బొట్టు దేవర్లు నిర్వహిస్తున్నా. ఇది అదృష్టంగా భావిస్తున్నా.
–దేవరింటి సుబ్బమ్మ, దేవరపెద్ద, ఎర్రబల్లె, కురబలకోట మండలం

కొత్త వారికి కుతూహలం



ముత్యమంత పసుపు ముఖమంత ఛాయ..ముత్తయిదు కుంకుమ బతుకంత ఛాయ..అనే పాట స్ఫురణకు తెచ్చేలా ఈ కొద్దేవర బొట్టు కార్యక్రమం సాగుతుంది. కుల దేవత, దేవుడి గుడి వద్ద లేదా బండ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించడం పరిపాటి. కొందరు ఇళ్ల వద్ద కూడా నిర్వహిస్తారు. పెద్దగా ఉన్న ఆమె మహిళలకు బొట్టును అందజేస్తారు. దాన్ని వారు నుదుట బొట్టుగా పెట్టుకుని వెళతారు. దీన్ని ఎంతగానో గౌరవంగా భావిస్తారు. ఇది కొత్త కోడళ్లకు, కొత్తవారికి చూడ్డానికి కుతూహలంగా ఉంటుంది.
– బైసాని జ్యోతి, జెడ్పీటీసీ సభ్యురాలు, కురబలకోట మండలం

హైదరాబాదు నుంచి వచ్చా



కొద్దేవర బొట్టు కార్యక్రమం మొరుసు కాపుల్లో విడదీయరాని బంధంగా వస్తోంది. ఇప్పుడే కాదు భవిష్యత్తులోను కొనసాగుతుందన్న నమ్మకం ఉంది. తరాలుగా ఇది ఆచారంగా వస్తోంది. దేశంలో ఎక్కడున్నా ఇళ్లకు వస్తారు. నేను హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నా. దీని కోసం సంతోషంగా వచ్చా. ఈ దేవరతో దాయాదులు, బంధుమిత్రులు అందరూ ఒక చోట కలవడం, యోగక్షేమాలు మాట్లాడుకుంటారు. ఆప్యాయత, అనురాగాలు పెరుగుతాయి. పరోక్షంగా వారిలోని ఐకమత్యానికి నిదర్శనంగా కూడా నిలుస్తోంది
– ఆర్.జానకి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, తూగువారిపల్లె, కురబలకోట మండలం

స్కిల్ కుంభకోణంలో బాబుకు ముడుపులు

- మేయర్ సురేష్‌బాబు



మాట్లాడుతున్న కడప మేయర్ సురేష్‌బాబు

కడప సెవెన్‌రోడ్స్ : స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో బోగస్ కంపెనీల ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రూ. 371 కోట్లు స్వాహా చేశారని కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు ఆరోపించారు. ఆదివారం అపూర్వ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యవహారంలో కళ్లు బైర్లు కమ్మే నిజాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే రంగ ప్రవేశం చేసి నలుగురిని అరెస్టు చేసిందన్నారు. సీమెన్స్ అనే కంపెనీ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఉదారంగా ముందుకు వచ్చిందని, ప్రాజెక్టు విలువ రూ. 3356 కోట్లు కాగా, అందులో 90 శాతం సీమెన్స్ గ్రాంటుగా ఇస్తుందన్నారు. ప్రభుత్వం పది శాతం ఇస్తే సరిపోతుందని నాడు సీఎం హోదాలో చంద్రబాబు చెప్పారన్నారు. జీఓలో కూడా ఇదే విషయాన్ని పొందుపరిచారని పేర్కొన్నారు. కానీ ఇందుకు సంబంధించిన డీపీఆర్, ఎంఒయూ ఏమీ లేవని తెలిపారు. లోకేష్ పాత్ర కూడా ఈ కుంభకోణంలో ఉందని ఆరోపించారు. అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతోపాటు టిడ్కో ఇళ్ల నిర్మాణాలను బాబు ప్రభుత్వం ఎల్‌అండ్‌టీ కంపెనీకి అప్పజెప్పిందన్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం చదరపు అడుగుకు రూ. 11 వేలకు పైగా చెల్లించారన్నారు. ఇది అసాధారణమనే విమర్శలు వచ్చినా పట్టించుకోకుండా చంద్రబాబు భారీగా కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. అవినీతి కుంభకోణాల్లో ఆరితేరిన చంద్రబాబు పాలన అంతాదోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడంగానే సాగిందని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి లక్షా 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో 40 వేల పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా చంద్రబాబు ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 10 కోట్ల చొప్పున లంచాలు ఇచ్చి కొనుగోలు చేశారని విమర్శించారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన నలుగురు ఎమ్మెల్యేలను తమ పార్టీ సస్పెండ్ చేసిందని చెప్పారు. మండలి ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓట్లు తమకే ఎక్కువ వచ్చాయన్నారు. పీడీఎఫ్, జనసేనలతో పొత్తుపెట్టుకోవడం వల్ల రెండో ప్రాధాన్యత ఓట్లు లభించి టీడీపీ అభ్యర్థులు గెలిచారని అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో తాము సింగిల్‌గానే 175 స్థానాలకు పోటీ చేసి గెలుపొందడం ఖాయమన్నారు. కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, పార్టీ నాయకుడు అఫ్జల్‌ఖాన్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అంపైర్, స్కోరర్ పరీక్షలకు ప్రత్యేక తరగతులు
కడప స్పోర్ట్స్: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ అంపైరింగ్, స్కోరింగ్ పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రత్యేకశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీఏవైడీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భరత్‌రెడ్డి, ఎ.రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆసక్తి గలవారు ఏప్రిల్ 2వ తేదీలోగా తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9052748786, 9052004338 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటినుంచి కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు
కడప వైఎస్ఆర్ సర్కిల్: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపునకు నిరసనగా సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం కడపలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి కేంద్ర ప్రభుత్వమే పూర్తి చేయాల్సి ఉన్నా విస్మరించడం దారుణమని అన్నారు.

నేటి నుంచి వైవీయూలో మిషన్ లెర్నింగ్‌పై సెమినార్
వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 27, 28 తేదీల్లో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్' అన్న అంశంపై రెండురోజుల జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వైవీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య తెలిపారు. ఈ సెమినార్ ప్రారంభోత్సవానికి వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్దన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు హాజరవుతారని చెప్పారు. వరంగల్ ఎన్ఐటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యు.ఎస్.ఎన్. రాజు రీసోర్స్‌పర్సన్‌గా హాజరవుతున్నట్లు తెలిపారు.

శివమొగ్గ-చెన్నై రైలు పొడిగింపు
కడప కోటిరెడ్డిసర్కిల్: శివమొగ్గ- చెన్నై- శివమొగ్గ (రైలు నెం.06223/06224) మధ్య నడుస్తున్న రైలును మరో మూడు నెలలు పొడిగించారని కడప రైల్వే స్టేషన్ మేనేజరు డి. నరసింహారెడ్డి, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు. ఈ రైలు వారానికి రెండు సార్లు నడుస్తుందన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కడప, ఎర్రగుంట్ల, రాజంపేట స్టేషన్లలో ఆగుతుందన్నారు. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు గతంలో ఈ వారాంతపు రైలును వేశారన్నారు. అయితే రద్దీ పూర్తి స్థాయిలో తగ్గకపోవడంతో మరో మూడు నెలలు రైలును పొడిగించారన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్నది హత్యే.!

- కిడ్నాప్ చేసి.. హత్య చేశారు
- పశుసంవర్ధక శాఖలో విభేదాలే కారణం
- కర్త, కర్మ, క్రియ సుభాష్ చంద్రబోస్
- పోలీసుల అదుపులో నిందితులు



అచ్చెన్న (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప/కడప అర్బన్: పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అచ్చెన్న అనుమానాస్పద మృతిని ఎట్టకేలకు పోలీసులు హత్యగా నిర్ధారించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ పక్కా పథకం ప్రకారం ఈ హత్య చేసినట్లు తెలుస్తోంది. డాక్టర్ అచ్చెన్న శాఖాపరమైన వేధింపులే హత్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్నను ఒప్పందం చేసుకున్న మరో ఇరువురి సహకారంతో డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ కిడ్నాప్ చేసి, ఆపై పథకం ప్రకారం అంతమొందించాడు. బొలేరో వాహనంలో అచ్చెన్నను తీసుకెళ్లిన ముఠా అతనికి మద్యం తాపించి ఆ తర్వాత గువ్వలచెరువు ఘాట్‌లో ప్రొటెక్షన్ వాల్ మీద నుంచి కిందికి తోసేసినట్లు తెలుస్తోంది.

సూత్రధారి.. పాత్రధారి సుభాష్ చంద్రబోస్..
డాక్టర్ అచ్చెన్న హత్యలో సూత్రధారి.. పాత్రధారి డాక్టర్ సుభాష్ చంద్రబోస్ అని తేలినట్లు సమాచారం. బోస్‌కు దగ్గరి మనుషులు మరో ఇద్దరిని పురమాయించుకొని చర్చి నుంచి వస్తున్న అచ్చెన్నను వెంబడించి, మంచి మాటలు చెప్పి బొలేరో వాహనంలో ఎక్కించుకొని తీసుకెళ్లినట్లు సమాచారం. గువ్వలచెరువు ఘాట్‌కు అవతల వైపు రామాపురం పోలీసు స్టేషన్ పరిధిలో అందరూ కలసి మద్యం సేవించిన అనంతరం తిరుగు ప్రయాణం అయ్యారు. అప్పటికే ఆవేశంతో రగిలిపోతున్న బోస్ బృందం ఘాట్‌లోకి రాగానే, ఒక్కమారుగా 12 అడుగుల లోతున్న లోయలోకి తోసేసినట్లు తెలుస్తోంది. ముందుగానే మధుమేహ వ్యాధితో బాధపడుతున్న అచ్చెన్న అంత ఎత్తు నుంచి కిందపడిపోతే మరణిస్తాడనే నమ్మకంతోనే అతన్ని చంపేందుకు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలిసింది. ముందు జాగ్రత్తగా అచ్చెన్న సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసినప్పటికీ చంద్రబోస్ సెల్‌ఫోన్ మాత్రం ఆన్‌లోనే ఉండటంతో అదే అతన్ని పట్టించినట్లు తెలుస్తోంది.

మిస్సింగ్ కేసు ఛేదించే క్రమంలో..
డాక్టర్ అచ్చెన్న రెండు రోజులుగా కన్పించడం లేదని అయన కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి కడప ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిపార్టుమెంటు పరిధిలో ఉన్న గొడవల కారణంగా జేడీ శారదమ్మ, ఇద్దరు ఏడీలు సుధీర్‌నాథ్ బెనర్జీ, శ్రీధర్ లింగారెడ్డి, చంద్రబోస్ మరికొంత మందిపై అనుమానం ఉన్నట్లు ఆరోపిస్తూ 14వతేదీ పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందించారు. ఆమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, అనుమానితులుగా ఉన్నవారు 3 రోజులుగా ఎక్కడెక్కడ ఉన్నారు. రోజువారి వివరాలను వారి ద్వారానే పోలీసులు సేకరించారు. ఈ నేపథ్యంలో ఈనెల 24న గువ్వలచెరువు ఘాట్‌లో పడి ఉన్న గుర్తుతెలియని మృతదేహం డాక్టర్ అచ్చెన్నదిగా గుర్తించారు. దీంతో అనుమానితులుగా భావిస్తున్న వారు ఈనెల 12నుంచి 14 వరకు వారి కదలికలకు సంబంధించి తమకు అందించిన సమాచారం సరిగ్గా ఉందా? లేదా? అని పోలీసులు క్రాస్ చెక్ చేశారు. ఈ క్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ ఫోన్ గువ్వలచెరువు టవర్ లొకేషన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. తీగ లాగితే డొంక కదిలినట్లు మరో ఇరువురు ప్రైవేటు వ్యక్తుల సహకారంతో తానే ఈ హత్యకు పాల్పడినట్లు డాక్టర్ సుభాష్ చంద్రబోస్ పోలీసుల ఎదుట అంగీకరించినట్లు తెలుస్తోంది.

లోతుగా దర్యాప్తు: డాక్టర్ అచ్చెన్న హత్యలో ఒ సుభాష్ చంద్రబోస్, మరో ఇద్దరు కాకుండా ఇంకా ఎవరైనా సహకారం అందించారా? ప్రత్యక్షంగా పాల్గొన్నారా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీసీ పుటేజీల ఆధారంగా అచ్చెన్నను తీసుకెళ్లిన వాహనాన్ని గుర్తించినట్లు సమాచారం. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పోలీసులు సంయుక్తంగా కేసును ఛేదించే పనిలో ఉన్నారు. నేడో రేపో మీడియా ముందు నిందితులను ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం.

మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలి: మందకృష్ణ

కడప కోటిరెడ్డిసర్కిల్: పశుసంవర్ధకశాఖ డీడీ అచ్చెన్న మృతికి కారకులను శిక్షించడంతో పాటు మృతుని కుటుంబానికి రూ. కోటి పరిహారం అందించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఆయన జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డాక్టర్ అచ్చెన్న హత్యకు కారకులైన వారు ఏ స్థాయిలో ఉన్నా కఠినంగా శిక్షించాలన్నారు. ఈ హత్యకు సంబంధించి కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్ష పాత్ర పోషించారని తెలుస్తోందన్నారు. ఉన్నత స్థాయి అధికారినే హత్య చేస్తే ఇక సామాన్య దళిత వర్గాలకు రక్షణ ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. అచ్చెన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానితులందరిపై విచారణ జరిపించాలని కోరారు.

ఉత్తమ బోధన..ఉజ్వాల భవిత

- పేద కుటుంబాల బాలికలకు కేజీబీవీలు వరం
- నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ



సింహాద్రిపురం కేజీబీవీ

కడప ఎడ్యుకేషన్: నిరుపేద కుటుంబాలు, అనాథ బాలికల చదువుకు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీలు) బాసటగా నిలుస్తున్నాయి. ఉచిత వసతి, భోజన సదుపాయం, ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. బాలికల ఉజ్వల భవితకు గట్టిపునాది వేస్తున్నాయి. తాజాగా కేజీబీవీల్లో 6వ తరగతితో పాటు ఇంటర్‌లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పేద కుటుంబాలకు చెందిన పిల్లల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ కార్యక్రమం ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానుంది.

జిల్లాలో 17 కేజీబీవీలు: జిల్లాలో బాలికల అక్షరాస్యత తక్కువగా ఉన్న మండలాల పరిధిలో కేజీబీవీలను ఏర్పాటు చేసింది. వీటిల్లో తొలుత 6 నుంచి 10వ తరగతి వరకు ఉండేది. అయితే 10వ తరగతి తర్వాత విద్యార్థులు చదువుకు దూరమవుతున్నట్లు తెలియడంతో.. ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టి 10వ తరగతి విద్యార్థులను ఇంటర్‌కు ప్రమోట్ చేస్తున్నారు. 2023-24వ విద్యా సంవత్సరానికి సంబంధించి 17 కేజీబీవీల్లో 6వ తరగతిలో 680, ఇంటర్మీడియట్‌లో 680 సీట్లను భర్తీ చేయనున్నారు. 7వ తరగతిలో ఖాళీగా ఉన్న 41సీట్లు , 8వ తరగతిలో 20 , 9వ తరగతిలో 19 సీట్లు భర్తీకానున్నాయి.

అర్హులు ఎవరంటే: బడిబయటి పిల్లలు, బడి మానేసిన వారు, అంగవైకల్యం ఉన్నవారు, అనాథలు, పేద ఎస్సీ , ఎస్టీ, బీసీ, మైనార్టీ..దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలకు తొలి ప్రాధాన్యతగా సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తారు. ఎంపికైన వారికి ఫోన్ మేసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. లేదంటే ఆయా కేజీబీవీ నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు.

అడ్మిషన్ల కోసం...
విద్యార్థిని తల్లిదండ్రులకు సంబంధించిన ఆధార్ కార్డు, తల్లిదండ్రులు లేకపోతే సంరక్షకుల ఆధార్ కార్డు, విద్యార్థినికి సంబంధించి 3 పాస్‌పోర్టు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, పనిచేస్తున్న మొబైల్ నెంబర్‌ను ఇవాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇంటర్ ఉన్న కేజీబీవీల వివరాలు...
జిల్లాలో అట్లూరు, చాపాడు, దువ్వూరు, పెద్దముడియం, పోరుమామిళ్ల, ఎస్ఏ కాశినాయన, సింహాద్రిపురం కేజీబీవీల్లో ఎంపీసీ గ్రూపు ఉండగా, బికోడూరు, బిమఠం, చక్రాయపేట, ఖాజీపేట, మైదుకూరు, పెండ్లిమర్రి, వల్లూరు, వేముల కేజీబీవీల్లో బైపీసీ, కలసపాడు కేజీబీవీలో హెచ్ఈసీ, జమ్మలమడుగు కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులు ఉన్నాయి.

అత్యుత్తమ బోధన



కేజీబీవీల్లో రూపాయి ఖర్చులేకుండా పేద బాలికలకు అత్యుత్తమ బోధన అందుతుంది. అర్హత కలిగిన వారు హెచ్‌టీటీపీ://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు సంబంధించి ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు గడువు ఉంది.
– ఎ ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

నిబంధనల మేరకు ప్రవేశాలు



కేజీబీవీల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే ప్రవేశాలు కల్పిస్తాం. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు తొలి ప్రాధాన్యం ఇస్తాం. పేద కుటుంబాల బాలికలకు కేజీబీవీలు ఆసరాగా నిలుస్తున్నాయి. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
– రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

క్లుప్తంగా

కోగటం మాజీ సర్పంచ్‌ను కలిసిన ఎమ్మెల్యే



కరుణ్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం: కమలాపురం మండలం కోగటం గ్రామ మాజీ సర్పంచ్ కరుణ్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కలిశారు. ఆదివారం ప్రొద్దుటూరులోని కరుణ్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే ఆయనను కలిసి పలు విషయాలు చర్చించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని ఎమ్మెల్యే కోరగా అందుకు కరుణ్‌రెడ్డి అంగీకరించినట్లు తెలిసింది. అలాగే వచ్చే వారంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలుద్దామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరంరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌర్ణమిని పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ఏప్రిల్ 5న తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు డిపో నుంచి మొదటిసారిగా ఇంద్ర సర్వీసులను నడుపుతున్నామని, రాత్రి 8.30 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ క్షేత్రానికి రానుపోను చార్జిగా రూ. 1392గా నిర్ణయించామన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం 7 గంటలకు నడపనున్న బస్సులో రూ. 1238, పులివెందుల డిపో నుంచి ఉదయం 7.30 గంటలకు బయలుదేరే బస్సులో రూ. 1112, మైదుకూరు డిపో నుంచి ఉదయం 6.30 గంటలకు వెళ్లనున్న బస్సులో రూ. 1280, బద్వేలు డిపో నుంచి రాత్రి 9.00 గంటలకు బయలుదేరే బస్సులో రూ. 1122, కడప డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు బయలుదేరు బస్సులో రూ. 964గా చార్జి నిర్ణయించామన్నారు.

బ్యాగ్ లాక్కెళ్లిన దొంగలు

బి.కొత్తకోట : కర్ణాటకలోని కొత్తవుడియంకు చెందిన భారతమ్మ ఆదివారం బి.కొత్తకోట–గుడిపల్లె మార్గంలోని మరవపల్లె క్రాస్ వద్ద ఉండగా దొంగలు బ్యాగ్‌ను లాక్కొని వెళ్లినట్లు ఆమె అల్లుడు జనార్దనరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం బట్లపల్లె నుంచి కొత్తవుడియం వెళ్లేందుకు బస్సు కోసం వేచి వుండగా.. రెండు బైక్‌ల్లో వచ్చిన వారు హ్యాండ్ బ్యాగ్ లాక్కెళ్లారు. ప్రయాణ ఖర్చుల కోసం ఉంచుకున్న రూ.5 వేలు అందులో ఉన్నాయని బాధితురాలు వాపోయింది. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రామమోహన్ చెప్పారు.

‘కళ’ తప్పిన రంగస్థలం

- కొడిగడుతున్న నాటక దీపం
- నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం



పౌరాణిక నాటకంలోని ఓ దృశ్యం (ఫైల్)

కడప కల్చరల్ : సురభి పుట్టిన జిల్లాలో నాటకం కొడిగడుతున్న దీపంలా కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు ఎంతో వైభవంగా చూసిన ఈ నేలపై.. నాటకం ఆనవాళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. భావితరాలు ఈ రంగం వైపు వచ్చే అవకాశాలు దాదాపు మూసుకుపోయాయి. సోమవారం ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రస్తుతం నాటకరంగం తీరుతెన్నులపై ప్రత్యేక కథనం.

ప్రస్తుతం రంగస్థల నాటకం దయనీయ స్థితిలో ఉంది. ఒకప్పుడు 30కి పైగా నాటక సంస్థలు ప్రతి మాసం ప్రదర్శనలిస్తూ ఉండేవి. కడప నగరంతో పాటు రాజంపేట, నందలూరు, ప్రొద్దుటూరు, రాయచోటిలలో తరుచూ ప్రదర్శనలు జరుగుతుండేవి. ప్రస్తుతం రెగ్యులర్‌గా నాటకాలు ప్రదర్శించే సంస్థలు లేవనే చెప్పక తప్పదు. నాడు కడపలో పాత రంగస్థలంతోపాటు చెన్నూరు బస్టాండు వద్ద రామకృష్ణ సమాజం, పాత బస్టాండులోని ఎన్జీఓ హోం, అప్పుడప్పుడు కడప నగరంలోని సీఎస్‌ఐ హైస్కూలు కూడా నాటక ప్రదర్శనలకు వేదికలుగా విలసిల్లాయి. పలు నాటక సంస్థలు కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా పలుమార్లు నాటక పరిషత్తులను కూడా నిర్వహించాయి. దాదాపు 30కి పైగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక నంది అవార్డులు, టీటీడీ గరుడ అవార్డులను సాధించాయి. కానీ నేడు ఈ వేదికలన్నీ నాటకానికి దూరమయ్యాయి. సినిమాలను తట్టుకుని నిలిచిన నాటకరంగం టీవీల దెబ్బకు కళ తప్పిందని పలువురు పేర్కొంటున్నారు. పౌరాణికంలో రిహార్సల్స్ తక్కువ గనుక టీవీ పోటీని కూడా తట్టుకుని నిలబడగలిగింది. నేటికీ గ్రామాల్లో గాత్ర శుద్ధిగల యువతతోపాటు వృద్ధులు కూడా పౌరాణిక నాటకాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉర్దూ నాటకానికి ‘పరదా’

జిల్లాలో ఉర్దూ నాటకం కూడా క్రమంగా కనుమరుగైంది. ఏటా రెండు, మూడుసార్లు ప్రదర్శించిన ఉర్దూ నాటకం ఇప్పుడు రెండు, మూడేళ్లకు ఒకటి కూడా కనిపించడం లేదు. అభిరుచిగల కళాకారులు కనుమరుగు కావడం, అభినివేశం గల వారు వృద్ధులు కావడం, కొత్త తరం ఇటువైపు చూడకపోవడంతో ఉర్దూ నాటకానికి పరదా పడింది. ముఖ్యంగా కడప నగరంలో ప్రముఖ ఉర్దూ కవి, రచయిత యూసఫ్ సఫీ తన నాటక రచన, ప్రదర్శనలతో సహచరులను ఎప్పటికప్పుడు ఉత్తేజ పరిచేవారు. ఆయన గతించడంతో ఉర్దూ నాటకం అక్కడే ఆగిపోయింది.

ఉన్నా లేనట్లే!

నాటకం వేసేందుకు ఎవరైనా ముందుకు వస్తే వారికి రంగ స్థలాలు దొరకడం కష్టమైంది. నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రాన్ని లక్షలాది రూపాయలతో ఆధునీకరించినా అద్దె ఎక్కువ అంటూ కళాకారులు ఆ వైపు రావడం లేదు. తప్పనిసరి అయితే బ్రౌన్ గ్రంథాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. దీంతో కళాక్షేత్రం నిర్వహణ కూడా బరువుగా మారింది. వైఎస్సార్ పేరిట నిర్మించిన ఆడిటోరియంలో నాటకం ప్రదర్శించి రెండు, మూడేళ్లు కావస్తోంది. ప్రొద్దుటూరులో కూడా ఇటీవల నాటకం జాడలేదు. రాజంపేట, నందలూరు, బద్వేలు, ఇతర పట్టణాలలో కూడా పరిస్థితి అలాగే ఉంది.

ఆశావహ స్థితి

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన యోగి వేమన విశ్వవిద్యాలయంలో లలిత కళల విభాగం ప్రత్యేకించి రంగస్థల కళల విభాగం ఈ రంగంపై ఆశలను సజీవంగా ఉంచుతోంది. ఇప్పటికి దాదాపు 10 నాటికలు, నాటకాలను ఆ విభాగ విద్యార్థులు ప్రశంసనీయంగా ప్రదర్శించారు. ఈ కోర్సులకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల నృత్యం, సంగీతం విభాగాలను కూడా ఏర్పాటు చేసి నగరవాసుల కోసం నగరంలోని కళాశాలల్లో శిక్షణ అందుబాటులోకి రావడంతో నాటక విభాగానికి కూడా ఆదరణ పెరుగుతోంది. యునైటెడ్ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల ఉన్నత విద్యా సంస్థల్లో కళారూపాల శిక్షణను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించడం, ఈ దశలో నాటకం పట్ల కొత్త ఆశలను రేపుతోంది.

సహకారం కావాలి



కళల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం, ముఖ్యంగా ఆర్థిక ప్రోత్సాహం అవసరం. ఇది వృత్తిగా లాభించదన్న అభిప్రాయంతో యువత ముందుకు రావడం లేదు. ఆర్థిక ప్రోత్సాహం ఉన్నప్పుడే రచయితలు, దర్శకులు, నటుల్లో కూడా ఆసక్తి పెరుగుతుంది. నాటకం మనుగడ సాగిస్తుంది. వైవీయూలో నాటక రంగ విభాగానికి ఊహించనంత డిమాండ్ ఏర్పడటంతో దీనికి మంచి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం పెరిగింది.

– ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రంగస్థల కళల విభాగం, వైవీయూ, కడప

29లోగా సర్టిఫికెట్లు అందజేయాలి

కడప ఎడ్యుకేషన్ : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 29వ తేదీలోగా తమకు సంబంధించిన సర్టిఫికెట్లను తమ పాఠశాల ద్వారా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 5న జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరైన వారి జాబితాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌సీ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన వారు తమకు సంబందించిన కుల, ఆదాయ సర్టిఫికెట్లు, 7వ తరగతి మార్కుల శాతాన్ని ధ్రువీకరించిన పత్రం, అంగవైకల్యం ఉన్న వారు వైకల్యము ధ్రువీకరించే పత్రం, హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతో జతపరిచి సంబంధిత పాఠశాల ద్వారా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ముద్దనూరు : ముద్దనూరు–పులివెందుల రహదారిలో మండలంలోని చిన్నదుద్యాల క్రాస్ వద్ద ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి బస్సులో 20 మద్యం సీసాలను బద్వేలు ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ చెన్నారెడ్డి తెలిపారు.

29న ద్విచక్రవాహనాల వేలం

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యజమాని ఎవరో తెలియని పట్టుకుని సీజ్ చేసిన ఐదు ద్విచక్ర వాహనాలకు ఈ నెల 29న పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ సయ్యద్ హాసం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ధారించిన ధర నుంచి బహిరంగ వేలం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొని కొనుగోలు చేయాలని కోరారు.

క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

శాప్ వీసీ, ఎండీ హర్షవర్ధన్



డీఎస్‌ఏ మైదానంలో పరిశీలిస్తున్న శాప్ వీసీ, ఎండీ సి.హర్షవర్ధన్

కడప స్పోర్ట్స్ : క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సి.హర్షవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానాన్ని ఆయన తనిఖీ చేశారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన జిమ్నాస్టిక్స్ హాల్‌ను పరిశీలించారు. పనులు ఎందుకు నిలిపివేశారని అధికారులను ప్రశ్నించారు. నిధుల చెల్లింపులో జాప్యం కారణంగా మధ్యలోనే సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎండీ వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని, నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిమ్‌సెంటర్, ఇండోర్ స్టేడియంలను పరిశీలించారు. అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట కేవీకేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వైఎస్సార్ క్రీడాపాఠశాల పరిశీలన

కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడాపాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాశిక్షకులు, ఉపాధ్యాయులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు. అనంతరం క్రీడాపాఠశాలలోని పలు క్రీడా విభాగాలను పరిశీలించారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వైఎస్సార్ క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థులు శివరామకృష్ణయాదవ్, రవిశంకర్‌ను అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాప్ బోర్డు డైరెక్టర్ మైఖేల్ డానియల్ ప్రదీప్, టెక్నికల్ ఏడీ దేవానంద్, స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి.అమృత్‌రాజ్, అన్నమయ్య జిల్లా చీఫ్ కోచ్ ఎస్‌ఎండీ షఫీ, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకుని..

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణ మూర్తులను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, ఎండీ కె.హర్షవర్ధన్ (ఐఏఎస్) దర్శించుకున్నారు.

నిరుపేద.. ఆపై పెద్ద బాధ

- తలలో గడ్డతో తల్లడిల్లుతున్న గర్భిణి
- వెంటనే ఆపరేషన్ చేయాలంటున్న వైద్యులు
- ఆపరేషన్‌కు రూ.2.50 లక్షలు అవసరం
- దాతల కోసం ఎదురుచూపు



షేక్ సత్తాజ్‌బీ

ప్రొద్దుటూరు క్రైం : నిరుపేద కుటుంబం.. ఆపై వారికి పెద్ద బాధ వచ్చింది. గర్భిణికి తలలో రక్తం గడ్డ కట్టింది.. వెంటనే ఆపరేషన్ చేయకుంటే చిన్న ప్రాణంతోపాటు పెద్ద ప్రాణానికి ప్రమాదమని వైద్యులు చెప్పారు. ఈ సమయంలో చేతిలో చిల్లిగవ్వ కూడా లేని ఈ పేద ముస్లిం కుటుంబం సాయం కోసం ఎదురు చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో దాతలు దయతలిస్తే.. తల్లీబిడ్డలను కాపాడుకుంటానని ఆమె భర్త ప్రాధేయపడుతున్నాడు. ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్ సుభాన్ ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. అతనికి సత్తాజ్‌బీతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి సానియా అనే రెండేళ్ల పాప ఉంది. మొదట కుమారుడు పుట్టి అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. కొన్ని నెలల క్రితం ఆమె మళ్లీ గర్భం దాల్చింది. అందుకు సంబంధించిన పరీక్షలు చేయించే క్రమంలో అధిక బీపీతోపాటు తలలో రక్తం గడ్డకట్టినట్లు స్కానింగ్‌లో నిర్ధారణ అయింది. దీంతో వైద్యుల సూచన మేరకు సత్తాజ్‌బీని కర్నూలులోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. పరిశీలించిన అక్కడి వైద్యులు తలలో గడ్డ ఉండటం మూలాన కడుపులో ఉన్న బిడ్డకు కూడా ప్రమాదమని తెలిపారు. అయితే దీనికి శస్త్ర చికిత్స ఇక్కడ చేయడం కుదరదని, ఇది ఎంతో రిస్కుతో కూడుకున్నదని వైద్యులు చెప్పారు. వేలూరు సీఎంసీ ఆస్పత్రికి వెళ్లితే మెరుగైన చికిత్స లభిస్తుందని సూచించారు. ఇప్పటికే సత్తాజ్‌బీ వైద్యం కోసం భర్త సుభాన్ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాడు. ఇక చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితుల్లో వార్డు కౌన్సిలర్ జిలాన్ ద్వారా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారి కుటుంబ, సత్తాజ్‌బీ ఆరోగ్య పరిస్థితి చూసి చలించిన ఎమ్మెల్యే రాచమల్లు రూ. 95 వేలు అందజేశారు.

ఈ నెల 29న ఆపరేషన్‌కు రమ్మన్నారు..

తమిళనాడులోని వేలూరు సీఎంసీ హాస్పిటల్‌కు సుమారు 9 నెలల పాటు తిరిగామని, ప్రతి నెల రూ.20 వేలు వరకు ఖర్చు అయినట్లు సుభాన్ తెలిపాడు. ఈ క్రమంలోనే ఈ నెల 29న సత్తాజ్‌జీ తలలో ఉన్న గడ్డకు ఆపరేషన్‌తోపాటు సిజేరియన్ చేయాల్సి ఉందన్నాడు. ఇందుకోసం రూ. 2 లక్షలు నుంచి రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుందని సీఎంసీ ఆస్పత్రి వైద్యులు చెప్పారన్నారు. మానవతా దృక్పథంతో సాయం చేస్తే తన భార్యాబిడ్డలను బతికించుకుంటానని సుభాన్ అంటున్నాడు. ఈ నిరుపేద ముస్లిం కుటుంబానికి 8463929731 అనే (గూగుల్‌పే, ఫోన్‌పే నంబర్) నంబర్‌కు ఫోన్ చేసి ఆర్థిక సాయం చేయాలని సుభాన్, సత్తాజ్‌జీ దంపతులు కోరుతున్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి



మృత్యువాత పడిన గొర్రెలు

జమ్మలమడుగు రూరల్ : గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో.. 7 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు నరసింహారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో శ్రీరాములపేటకు చెందిన నరసింహారెడ్డికి మొత్తం 8 గొర్రెలు ఉన్నాయి. శనివారం పొలానికి తీసుకెళ్లి మేత తిన్న తరువాత ఇంటికి తీసుకొచ్చి ఒక షెడ్డులో వదిలాడు. అర్ధరాత్రి కాలనీకి చెందిన కుక్కలు దాడి చేశాయి. 7 గొర్రెలు మృత్యువాత పడగా, ఒక గొర్రె తప్పించుకుంది. తెల్లవారి చూసే సరికి గొర్రెలు మృతి చెంది ఉన్నాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనివల్ల దాదాపు రూ.70 వేల నష్టం వాటిల్లిందని ఆయన వాపోయాడు. కాలనీలో ఎక్కువ కుక్కలు ఉన్నాయని, వాటిని అధికారులు అరికట్టాలని ఆయన కోరారు.

గండికోట జలాశయంలో వ్యక్తి మృతి



గండికోట జలాశయంలో తేలియాడుతున్న మృతదేహం

కొండాపురం : గండికోట జలాశయంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొండాపురం పట్టాణానికి చెందిన ఇమ్మానియల్(26) అలియాస్ ఇమ్ము మూడు రోజులుగా కనిపించడం లేదని తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గండికోట జలాశయంలో ఆదివారం మృతదేహమై తేలాడు. ఆయనకు ఏడాది క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

అమర వీర జవాన్ విగ్రహ ఆవిష్కరణ



విగ్రహ ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచపల్లె గ్రామంలో కొండూరు సరోజనమ్మ, కొండూరు జయరామరాజు జ్యేష్ఠ పుత్రుడు అమర వీర జవాన్ లాన్స్‌నాయక్ కొండూరు యుగంధర్ విగ్రహాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బెంగళూరుకు చెందిన సతీష్‌కుమార్ ఆవిష్కరించి, భారత మిలటరీ పద్ధతిలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ రాష్ట్రపతి అవార్డు గ్రహీత, దేశం కోసం ప్రాణాలు వదిలిన వీర జవాన్ లాన్స్‌నాయక్ కొండూరు యుగంధర్ దేశం గర్వించదగ్గ వ్యక్తి అని, తాను ఎంచుకున్న మార్గంలో తన ప్రాణాలను కూడా లెక్క చేయని వ్యక్తి అని కొనియాడారు. ఆయన భావి తరాలకు ఆదర్శమూర్తి అన్నారు. అనంతరం బెంగళూరుకు చెందిన సతీష్ కుమార్ మాట్లాడుతూ 2003లో 6932 మీటర్లు గల కైలాస పర్వతం అధిరోహించి అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా సాహస అవార్డు అందుకున్నారని తెలిపారు. 2005లో 7138 మీటర్ల గల చాకుంబా–1 పీక్ అనే ఎత్తయిన శిఖరాన్ని అధిరోహిస్తూ భారత జాతి కీర్తిని హిమ శిఖరాలకు చేర్చే క్రమంలో కొండ చరియలు విరిగిపడి వీరమరణం చెందాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఎం. ఓబులేసు, బి.కృష్ణయ్య, శేఖర్, శ్రీనివాసులరెడ్డి, చంద్రాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



ఐక్యత చాటుతున్న దళిత నేతలు


రాజంపేట : దళితులు ఐకమత్యంతో ముందుకెళ్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు దళితనేతలు తెలిపారు. ఆదివారం ఎస్సార్ కల్యాణ మండపంలో మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఉభయ జిల్లాల దళితుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు యమాల సుదర్శన్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంసంజీవ్, గల్ఫ్ రాయలసీమ అసోసియేషన్ అధినేత దుగ్గి గంగాధరం, మాలమహానాడు గాలి శెట్టి సుధాకర్, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబు సూర్యనారాయణ, దళిత ఐక్యవేదిక రాష్ట్రనాయకుడు ఆర్ముగం విశ్వనాథ్, ఏపీజీబీ మాజీ మేనేజరు పిల్లి చంద్రశేఖర్, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరు పెనుబాల నాగసుబ్బయ్య మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో దళితులు సత్తా చాటాలన్నారు. దళితుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా మాలల జేఏసీ పని చేస్తుందని స్పష్టం చేశారు.

అంబేడ్కర్‌కు నివాళి

పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కాకిచంద్ర, పాపయ్య, చంద్రమౌళి, కొండాపురం మనోహర్‌బాబు, దాసరి పెంచలయ్య, మోడపోతుల రాము, బియ్యాల రమణ, అన్నమయ్య జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు శివయ్య, రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు నరేష్, జైభారత్ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, మాలమహానాడు నాయకులు బండేపల్లె రమణయ్య, సీపీఎం దళిత నాయకుడు పందికాళ్ల సుబ్రమణ్యం, ఓబిలి పెంచలయ్య, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ జనగణనతో సామాజిక అసమానతలు దూరం

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాశీం



నినాదాలు చేస్తున్న బీసీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ జనగణన సాధనతోనే సామాజిక అసమానతలు తొలగిపోతాయని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాశీం పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో బీసీ జనగణనపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులనే అస్త్రాలుగా చేసుకుని బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, సామాజిక కార్యకర్త మల్లెల భాస్కర్ మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి వ్యవస్థలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించడమే రిజర్వేషన్ల లక్ష్యమన్నారు. జాతీయ బీసీ జేఏసీ అధ్యక్షుడు వలిగట్ల రెడ్డెప్ప, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ బీసీలు రాజకీయాలకు దూరంగా ఉన్నంత కాలం రాజ్యాధికార లక్ష్యానికి చేరువకాలేరన్నారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మి నరసయ్య, సహ అధ్యక్షుడు సందు శివనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు గొడుగు గురప్ప, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి కృష్ణయ్య, దేవానంద్, కల్యాణమండపం అధ్యక్షుడు తాండవకృష్ణ, రాష్ట్రబీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు నూకాలమ్మ, ఆవుల నరసింహారావు, గురుమూర్తి, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లలోని వేంపల్లి రోడ్డులో ఆదివారం లారీ ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వై.కోడూరు గ్రామానికి చెందిన బొందలకుంట శ్రీనివాసులు, వెంకటమ్మ రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వెంకటమ్మకు జ్వరం వస్తుండటంతో కుమారుడైన ఓబులేసుతో కలిసి ఎర్రగుంట్ల ఆసుపత్రికి వచ్చి చూపించుకుంది. తర్వాత స్వగ్రామానికి బైక్‌పై బయలు దేరారు. వేంపల్లి రోడ్డులోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే.. మరో బైక్‌ను తప్పించబోతుండగా లారీ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటమ్మకు తీవ్ర గాయాలు కావడంతో.. అక్కడికక్కడే మృతి చెందింది. ఓబులేసుకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తికి కూడా గాయాలు అయ్యాయి. సంఘటన స్థలాన్ని సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్‌ఐలు వెంకటక్రిష్ణయ్య, ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.